ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు..



సనత్‌నగర్: (కిలో..రూపాయల్లో..) టమాటా.41, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 41, క్యారెట్ 28, దొండ 75, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 25, మొరంగడ్డ 35, కందగడ్డ 35, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు గాయత్రీనగర్ రాక్ గార్డెన్‌లో ఉచిత వైద్య శిబిరం

సనత్‌నగర్: జెక్‌కాలనీలోని పార్థివ్ లంగ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం మోతీనగర్ సమీపంలోని గాయత్రీనగర్ రాక్‌గార్డెన్ పార్కు (సున్నం చెరువు పక్కన)లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. గాయత్రీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ నాగరాజు, కన్సల్టెంట్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ రాధ, జనరల్ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ మౌనికారెడ్డిల బృందం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు పల్మనాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, డెంటల్ తదితర వైద్య పరీక్షలు జరుపుతారని నిర్వాహకులు తెలిపారు.

న్యాయ సదస్సుకు హాజరైన కోట నీలిమ



న్యాయ సదస్సులో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ..

సనత్‌నగర్: ఏఐసీసీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని విజ్ఞానభవన్‌లో జరిగిన న్యాయ సదస్సులో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు హాజరైన ఈ సదస్సులో న్యాయపరమైనటువంటి అంశాలపై చర్చించినట్లు నీలిమ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ పథకాలతో మరింత చేరికలు

రాంగోపాల్‌పేట్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ఎంతో మంది నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. శనివారం మోండా డివిజన్ సీనియర్ నాయకులు చిర్రబోయిన సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో రెజిమెంటల్‌బజార్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకురాలు, సంతోషీ మాత దేవాలయ మాజీ బోర్డు సభ్యురాలు భాగ్య, సామాజిక కార్యకర్త సునంద, బీజేపీ నాయకలు సాయి తదితరులు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

వృద్ధుడి అదృశ్యం



సోమయ్య

అడ్డగుట్ట: ఇంటి నుంచి బయకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ లింగరాజు తెలిపిన వివరాల మేరకు తార్నాకలోని విజయపురి కాలనీకి చెందిన పీ. సోమయ్య(65) గత నెల 27న రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. తిరిగిరాకపోవడంతో అతని కుటుంబసభ్యులు తమకు తెలిసిన వారిని, బంధువులను వాకబు చేసినా ఫలితం కనిపించలేదు. దీంతో వృద్ధుడి కుమారుడు రమేష్ లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి



నర్సింహులు (ఫైల్)

అమీర్‌పేట: గుండెపోటుతో హోంగార్డు మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా మధిరకు చెందిన నర్సింహులు (44) ఎస్‌ఆర్‌నగర్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు.శనివారం ఉదయం ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలింగా చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి,సంతాపం తెలిపారు. మృతుడికి భార్య, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

ఇంటింటికీ రంగుల మార్కులు

స్వచ్ఛ ఆటోలకు చెత్త ఇవ్వని ఇళ్ల గుర్తింపు



ఓ ఇంటికి మార్కింగ్ వేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది



జీహెచ్‌ఎంసీ నిర్ణయించిన రంగుల నమూనాలు

- పారిశుధ్యం కోసం అవగాహన
- రహదారుల పరిశుభ్రత కోసం ప్రత్యేక చర్యలు
- సికింద్రాబాద్‌లో ఇంటింటికీ మార్కింగ్‌లు ప్రారంభం

సికింద్రాబాద్: రూ.కోట్లు వెచ్చించి ఆధునీకరిస్తున్న రహదారులు కొందరి నిర్లక్ష్యం కారణంగా చెత్తమయం అవుతున్నాయి. ఒక్క రోజు రహదారులను శుభ్రం చేయడం కుదరకపోతే మొత్తం అస్తవ్యస్థ పరిస్థితులు ఎదురవుతున్నాయి. చెత్తచెదారాలతో నిండిపోయిన రహదారులు ప్రతినిత్యం పర్యవేక్షించడం జీహెచ్‌ఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బందికి ఒక ప్రహసనంగా మారుతోంది. జీహెచ్‌ఎంసీ అధ్యయనంలో ఆటోవాలలకు చెత్తను ఇవ్వకుండా రహదారులపై పలువురు చెత్తకవర్లను పడవేస్తున్న ఫలితంగానే ఈ దుస్థితి ఎదురవుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇక మీదట రహదారులు చెత్తమయం కాకుండా ఉండేందుకు జోనల్ కార్యాలయ అధికారులు వినూత్న పథకాన్నికి శ్రీకారం చుట్టారు. ఈ విధానం అన్ని సర్కిళ్ల పరిధిలో పక్కా అమలు చేయాలంటూ ఆదేశాలు జారీచేశారు.

ఇంటింటికీ రంగుల బోర్డులు..

ప్రాంతాల వారిగా శానిటరీ సిబ్బందితో పర్యవేక్షణ చేయిస్తున్నారు. సాట్ (స్వచ్ఛ ఆటో టిప్పర్) లకు చెత్త ఇవ్వని వారి గృహాలు, అప్పుడప్పుడు ఇచ్చే గృహాలు, మొత్తంగా చెత్తను సాట్‌లకు ఇవ్వని గృహాల వివరాలు రాబడుతున్నారు. ఆటోలకు మొత్తంగా చెత్తను ఇవ్వనివారు వారి ఇంటి నుంచి వ్యర్థాలతో కూడిన చెత్తను బయటకు తీసుకెళ్లి రోడ్డుమీద వేస్తున్నట్టు గుర్తిస్తున్నారు.

- మొత్తంగా సాట్‌లకు చెత్త ఇవ్వని వారి ఇంటి ముందు ఎరుపు రంగుతో నెంబర్‌ప్లేట్ ఏర్పాటు చేస్తున్నారు. ఆ ప్రాంత మున్సిపల్ డివిజన్ నెంబర్ ముందు రాసి అక్కడ మొత్తంగా చెత్త ఇవ్వనివారి సంఖ్యకు కింద పెయింట్‌తో రాస్తున్నారు.
- క్రమం తప్పకుండా ఆటోవాలాలలకు చెత్తను ఇస్తున్న ఇండ్లను గుర్తించి ఆ గృహాలకు నీలిరంగు బోర్డు ఏర్పాటు చేసి నెంబర్ వేస్తున్నారు.
- అప్పుడప్పుడు ఆటోవారికి చెత్తను ఇచ్చి చాలా సార్లు ఇవ్వని వారి ఇండ్లను గుర్తించి వారి ఇంటి ముందు ఆకుపచ్చరంగుతో బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

వ్యాపార సంస్థలపై ప్రత్యేక దృష్టి...

జనవాసాలతోపాటు చెత్తను రహదారులపై వేస్తున్న వ్యాపార వాణిజ్య వర్గాలకు చెందిన వారిపై ఉక్కుపాదం మోపేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఒకటి రెండు మార్లు పారిశుధ్య సిబ్బంది రహదారులపై చెత్తవేసే వ్యాపారులను హెచ్చరించడం లాంటి చర్యలకు శ్రీకారం చుట్టారు. ఆ మీదట నోటీసులు ఇవ్వాలనుకున్నారు. అయినప్పటికీ రహదారులపై వ్యాపారులు చెత్తవేస్తే సదరు వ్యాపారాలను సీజ్ చేయడం, లైసెన్స్‌ను రద్దు చేయడం వంటి చర్యలకు ఉపక్రమించాలని జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్ణయించారు.

అవగాహన కోసమే బోర్డులు: జడ్‌సీ

రహదారులపై ఆరోగ్యకర వాతావరణం ఏర్పాటు చేయడం కోసమే మూడు రంగుల్లో బోర్డులు వేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవి కిరణ్ తెలిపారు. జోనల్ పరిధిలోని ఐదు సర్కిల్ కార్యాలయాల్లో ఈ ప్రక్రియను ప్రారంభించామన్నారు. రహదారులను శుభ్రంగా ఉంచడం, నగర ప్రతిష్టను మరింత పెంచడం కోసం జీహెచ్‌ఎంసీ పరంగా జరుగుతున్న పారిశుద్ధ్యం పనులకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని జడ్‌సీ కోరారు.

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు : తలసాని



దాతలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట: ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేస్తానని, ఆ తర్వాత అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపుతానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం బల్కంపేటలో గల శ్రీ వీరహనుమాన్ వ్యాయామశాలలో దాతలు అందజేసిన రూ.10 లక్షల విలువైన పరికరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలు గౌతమ్ రెడ్డి, వెంకట రాజం ,శ్రీహరి, సుబ్బరాజు, అనంత్ రెడ్డి, సుభాష్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డిలను సత్కరించారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానని ఈ సందర్భంగా తలసాని పేర్కొన్నారు.కార్యక్రమంలో వ్యాయామశాల నిర్వాహకులు రాజేశ్వర్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు హనుమంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం జాగృతి పోరు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాగృతి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో పోరాడనున్నట్లు ఓయూ విద్యార్థి నాయకులు పేర్కొన్నారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఈ నెల 5, 6, 7 తేదీలలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించతలపెట్టిన 72 గంటల దీక్షను విజయవంతానికి రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జాగృతి నేతలు డా. ఎల్చాల దత్తాత్రేయ, డా.కందుల మధు, లింగంప్రజాపతి, మన అశోక్ యాదవ్ తదితరులు మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లతో పాటు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలుకుతెలంగాణ జాగృతి, యునైటెట్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యునైటెట్ పూలే ఫ్రంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆలకుంట హరి, కృష్ణముదిరాజ్ పాల్గొన్నారు.

హేమావతినగర్‌లో చోరీ

సనత్‌నగర్: బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదు మాయమైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. మోతీనగర్ హేమావతినగర్‌లో నివాసం ఉండే యెర్రా వసంత (54) నాలుగు రోజుల క్రితం తన బంధువుల ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో ఆమె బావ మరిది కుమారుడు నవీన్‌కుమార్ ఇంట్లోనే ఉన్నాడు. ఈ నెల 1న మధ్యాహ్నం ఆమె ఇంటికి తిరిగి రాగా తలుపులు తెరిచి ఉండడం, నవీన్ కుమార్ ఇంట్లో లేకపోవడం గమనించింది. దీంతో వెంటనే నవీన్‌కు ఫోన్ చేయగా తాను ఇంటికి తాళం వేసి తాళంచెవులను పొరుగింట్లో ఇచ్చినట్లు చెప్పాడు. సుమారు మూడు తులాల బంగారు నెక్లెస్, అరతుల బంగారు గొలుసు, వేలి ఉంగరాలు మొత్తం మూడున్నర తులాల బంగారు ఆభరణాలతో పాటు నగదు దొంగిలించినట్లు గుర్తించారు. బాధితురాలు సనత్‌నగర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

సనత్‌నగర్: రెండు గ్యాంగ్‌ల మధ్య గొడవకు కారణమైన ఓ వ్యక్తిపై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. దీన్‌దయాళ్‌నగర్‌లో గొడవ జరుగుతుందన్న సమాచారం మేరకు పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. లక్ష్మణ్‌రెడ్డి, మల్లేష్ అనే ఇద్దరు గొడవ పడుతున్నట్లుగా గమనించారు. వారి మధ్య గొడవను ఆపి అక్కడి నుంచి పంపించారు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ గొడవ జరుగుతుందని సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి చేరుకునేసరికి ఇరు గ్రూపులు ఘర్షణ పడుతున్నారు. లక్ష్మణ్‌రెడ్డి తన గ్యాంగ్ సభ్యులను కొంతమందిని బేగంపేట నుంచి పిలిపించి మల్లేష్ గ్యాంగ్ సభ్యులతో గొడవ పడడాన్ని పోలీసులు గుర్తించారు.దీంతో గొడవకు కారణమైన సతీష్ అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ కానిస్టేబుల్ రామకృష్ణగౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిని బెదిరించి నగలు దోపిడీ



వివరాలు వెల్లడిస్తున్న బాధితురాలు సత్తెమ్మ

చిలకలగూడ: ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలిని బెదిరించిన దుండగుడు ఆమె మెడలోని బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌హెచ్‌ఓ అనుదీప్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్ తెలిపిన మేరకు.. సీతాఫల్‌మండి మేడిబావి గౌరీసదన్ అపార్ట్‌మెంట్‌లో సత్తెమ్మ (85) ఒంటరిగా నివసిస్తోంది. కేర్‌టేకర్‌గా ప్రసన్న అనే యువతి పనిచేస్తోంది. శనివారం ఉదయం 8 గంటల సమయంలో హెల్మెట్ పెట్టుకున్న అగంతకుడు వృద్ధురాలు సత్తెమ్మ ఇంట్లోకి ప్రవేశించాడు. ఇంటర్‌నెట్ మరమ్మత్తుల కోసం వచ్చానని నమ్మబలికాడు. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు నటించాడు. కేర్‌టేకర్ ప్రసన్న మరోగదిలో ఉండడాన్ని గమనించి ఆ గది తలుపు వేసి గడియపెట్టాడు. మంచంపై ఉన్న వృద్ధురాలిని బెదిరించి ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసు, చేతికి ఉన్న తులం గాజులు గుంజుకుని క్షణాల్లో అక్కడి నుంచి పరారయ్యాడు. సీసీ కెమెరాల ఫుటేజీ రికార్డింగ్ డివైజ్‌ను తనవెంట తీసుకువెళ్లాడు. కొంత సమయం తర్వాత డ్రైవర్ నాగరాజు వచ్చాడు. సత్తెమ్మ గుర్తుతెలియని వ్యక్తి తనను బెదిరించి బంగారు నగలు దోచుకెళ్లాడని చెప్పింది. గదిలో బందీగా ఉన్న కేర్‌టేకర్ ప్రసన్న కేకలు వేయడంతో తలుపు గడియ తీసి డయల్ 100కు సమాచారం అందించాడు. చిలకలగూడ పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని బాధిత వృద్ధురాలు, కేర్‌టేకర్, డ్రైవర్ల నుంచి వివరాలు సేకరించారు.

టాప్ ఫోర్‌లో.. వైజాగ్ పోర్ట్

అమీర్‌పేట: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న టాప్ పోర్టుల్లో విశాఖపట్నం ఒకటని, 2025-26 ఆర్థిక సంవత్సరానికి 90 మిలియన్ టన్నుల కార్గో నిర్వహణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు పోర్ట్ అధికారి, కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్. శ్రీధర్ తెలిపారు. అమీర్‌పేట గ్రీన్‌పార్క్ హోటల్ మేరిగోల్డ్‌లో శుక్రవారం రాత్రి తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇడస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ)తో కలిసి నిర్వహించిన ట్రేడ్ మీట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖట్నం పోర్ట్ ప్రస్తుతం భారతదేశంలోనే వేగవంతమైన పోర్ట్‌గా నిలిచిందని అన్నారు. పోర్ట్ నుండి ప్రధాన రహదారులను కలుపుతూ 15 కిలోమీటర్ల దూరంలోని రహదారి నిర్మాణంలో ఉందన్నారు. ఇది ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు సరుకుల రవాణాను వేగవంతం చేసేందుకు దోహదపడుతుందని చెప్పారు.ఎఫ్‌టిసీసీఐ అధ్యక్షులు ఆర్.రవికుమార్ పాల్గొన్నారు.

గద్దర్ స్మృతి వనం నిర్మాణాన్ని విస్మరించిన ప్రభుత్వం

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రజాయుద్ధనౌక గద్దర్ స్మృతి వనం నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని ఓయూ విద్యార్థులు పేర్కొన్నారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న రవీంద్ర భారతీలో నిర్వహించతలపెట్టిన గద్దర్ 2వ వర్ధంతి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థి నాయకులు మాట్లాడుతూ గద్దర్ ప్రథమ వర్ధంతి సభలో నెక్లెస్ రోడ్డులో ఎకరం భూమిని కేటాయించి స్మృతి వనాన్ని నిర్మిస్తామని ప్రకటించిన పాలకులు ఇంత వరకు స్థలాన్ని కూడ కేటాయించలేదని మండిపడ్డారు.కార్యక్రమంలో సూర్యం గద్దర్, కోట శ్రీనివాస్‌గౌడ్, సునీల్‌శెట్టి, కంచర్ల బద్రీ పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ఆమోదించాలని ఓయూలో విద్యార్థులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీసీ విద్యార్థులు మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానించిన బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించిన వెంటనే 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదంపొందకుంటే తెలంగాణ వ్యాప్తంగా బీసీల చైతన్య యాత్రతో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మబోయిన సైదులుయాదవ్, టీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు భారీ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

హైడ్రా కూల్చివేతలను అడ్డుకున్న స్థానికులు

అమీర్‌పేట: హైడ్రా కూల్చివేతలను స్థానికులు అడ్డుకున్నారు.అమీర్‌పేట గురుద్వారా సమీపంలో ఉన్న నాలాపై వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా స్లాబు వేశారు. శనివారం హైడ్రా,జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు పోలీసుల బందోబస్తు నడుమ నిర్మాణాలను కూల్చి వేసేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు.షెడ్లు నిర్మాణంపై ఫిర్యాదులు వచ్చాయని అధికారులు చెప్పేందుకు ప్రయత్నించారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసి జేసీబీకి అడ్డుగా నిల్చుని నాలాపై బైటాయించి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

విద్యాసంస్థల నిర్మాణానికి నిధులు కేటాయించండి



విద్యా సంస్థల నిర్మాణం ఆగిపోయిన తీరును మంత్రికి చూపిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

మంత్రి పొన్నంకు ఎమ్మెల్యే పద్మారావు వినతి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో నిర్మాణం పనులు అర్థాంతరంగా నిలిచిపోయిన విద్యాసంస్థలకు నిధులు మంజూరు చేయాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ కోరారు. శనివారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నిలిచిపోయిన భవన స్థలాన్ని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ మంత్రికి చూపించారు. అనంతరం ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ మంత్రితో మాట్లాడుతూ ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల భవనాల నిర్మాణం ఆగిపోయిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని నిధుల మంజూరుకు హామీ కూడా ఇచ్చినట్టు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యా సంస్థలకు కొత్త భవనాల నిర్మాణం కోసం రూ.29.75 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు మంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన మంత్రి నిధులు సమకూర్చి నిర్మాణం పనులు వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న జిల్లా కలెక్టర్ హరిచందనను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు, కాంగ్రెస్ సికింద్రాబాద్ ఇన్‌ఛార్జి ఆదం సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ హరిచందన

రాంగోపాల్‌పేట్: నిరుద్యోగ యువతకు శిక్షణ, నైపుణ్యాల కల్పన ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన అన్నారు. శనివారం సికింద్రాబాద్‌లోని అవినాష్ కళాశాలలో ఉద్యోగ మేళాను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోనే ప్రముఖ వ్యాపార సంస్థ అయినా ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మొట్టమొదటి సారి ఉద్యోగ మేళాను నిర్వహించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. జాబ్‌మేళాకు 1200 మంది హాజరయ్యారు. ఫిక్కీ మహిళ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు పింకీ రెడ్డి, వైస్‌ఛర్మన్ కామిని సరాఫ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెవ్యాధుల నిర్ధారణలో ఈసీజీ కీలకం



సదస్సులో పాల్గొన్న వైద్యులు

రాంగోపాల్‌పేట్: హృదయ సంబంధ వ్యాధులను నిర్ధారించి సరియైన చికిత్స అందించేందుకు ఈసీజీ ఎంతో కీలకం అని కిమ్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు అన్నారు. శనివారం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎలక్ట్రోఫిజియాలజిస్టులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆస్పత్రి ఎలక్ట్రో ఫిజియాలజి అండ్ ఫేసింగ్ డివిజన్ అధిపతి డాక్టర్ హైగ్రీవ్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. గుండె సంబంధ వ్యాధులను నిర్ధారించడంలో అతి తక్కువ ఖర్చుతో అయ్యేది ఈసీజీ అని కార్డియాలజిస్టులు దీన్ని చదవడం నేర్చుకుని రోగులకు తగిన సమయంలో సరియైన చికిత్స అందించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు.

క్రిస్టియన్ సెమెట్రీ అభివద్ధికి ఎమ్మెల్యే శ్రీగణేష్ చొరవ

బొల్లారం: తిరుమలగిరిలో క్రిస్టియన్ కమ్యూనిటీకి చెందిన సెమెట్రీ సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ చర్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన డిఫెన్స్ ఎస్టేట్ ఆఫీసర్ (డీఈఓ)ను కలిశారు. ఎన్నో ఏళ్లుగా సెమెట్రీ పునరుద్ధరణ కోసం కమ్యూనిటీ సభ్యులు వినతులు చేస్తున్నప్పటికీ, ఇప్పటివరకు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని ఎమ్మెల్యే అధికారులకు వివరించారు. సెమెట్రీను అభివద్ధి చేసి, తిరిగి క్రిస్టియన్ కమ్యూనిటీకి అప్పగించాలని కోరారు.



డీఈఓను కలిసి క్రిస్టియన్ సెమెట్రీ సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

తొలగించిన చెట్టుకొమ్మలను తరలించండి



శ్రీనివాసనగర్ రహదారిపై వదిలేసిన చెట్టుకొమ్మలు

చిలకలగూడ: తొలగించిన చెట్టుకొమ్మలను డంపింగ్‌యార్డుకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ ప్రధాన రహదారిలో విద్యుత్ తీగలకు అడ్డుగా పెరిగిన చెట్టుకొమ్మలను వారం రోజుల క్రితం తొలగించారు. వాటిని డంపింగ్‌యార్డుకు తరలించకుండా అక్కడే వదిలేయడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయని, స్థానికులతోపాటు వాహనదారులు, పాదాచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

‘మూలం సంత’కు విశేష ఆదరణ



మూలం సంతను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న దృశ్యం

లాలాపేట: గ్రామభారతీ, సీఎస్‌ఆర్ మెమోరియల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 14వ మూలం సంతకు విశేష ఆదరణ లభించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి రైతులు, చేతి వృత్తుల వారు పాల్గొని దాదాపు 60కి పైగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. గోసేవా ప్రాంత ప్రముఖ్ వెంకట నివాస్, రాష్ట్ర గోసేవా ప్రశిక్షణ్ ప్రముఖ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నదానం చేయొద్దంటూ గేటు బంద్



నిమ్స్ పార్కింగ్ వద్ద గేటు బంద్ చేయడంతో బారులు తీరిన అన్నార్తులు

బంజారాహిల్స్: నిమ్స్ ఆస్పత్రి పార్కింగ్ స్థలం నుంచి బాలాపురి బస్తీ వైపు ఓ గేటు ఉంటుంది. ఈ గేటు వద్ద కొన్ని స్వచ్ఛంద సంస్థలు నిత్యం ఉదయం వేళల్లో 300 నుంచి 500 మందికి అన్నదానం చేస్తుంటాయి. గడిచిన మూడు రోజుల నుంచి నిమ్స్ అధికారులు ఈ గేటు మూసివేశారు. దీంతో రోగుల సహాయకులు ఆకలితో ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి అనారోగ్య సమస్యలతో వస్తుంటారని అలాంటి వారికి అన్నదానం చేస్తుంటే ఆపడం ఎంత వరకు సబబు అని బాలాపురి బస్తీవాసి, అన్నదాత బిట్ల శ్రీనివాస్ రాజు ప్రశ్నించారు. గేటు తెరవకపోతే ఈ విషయమై సంబంధిత శాఖా మంత్రిని కూడా కలిసి నిమ్స్ డైరెక్టర్, అధికారులపై ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

జీవో 99 రోస్టర్ విధానంతో మాలలకు అన్యాయం

తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ

హిమాయత్‌నగర్: తెలంగాణలో జీవో 99 రోస్టర్ విధానం వల్ల సుమారు 40 లక్షల మంది మాల విద్యార్థులు, ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ మందాల భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జేఏసీ గౌరవాధ్యక్షుడు చెరుకు రామచందర్, గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మాల, మాల ఉపకులాలను వర్గీకరణలో మూడో గ్రూపులో చేర్చి 22వ రోస్టర్ పాయింట్ కేటాయించడం వల్ల ఎంసెట్, నీట్ అడ్మిషన్లలో శాతవాహన యూనివర్సిటీ, హెల్త్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగాల్లో మాలలకు అన్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 10, జీవో 99లను తక్షణమే సవరించి రోస్టర్ పాయింట్‌ను మూడు లేక 12గా నిర్ధారించాలని డిమాండ్ చేశారు.